క్లుప్తంగా

ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలి

మరికల్: ఓటర్ కార్డుకు ఆధార్‌తో పాటు మొబైల్ నంబర్‌ను అనుసంధానం చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ రాంకోటి అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మరికల్ మండలం పరిధిలో ఉన్న నారాయణపేట, మక్తల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో మూడు రోజుల్లో క్షేత్రస్థాయిలో ఆధార్ అనుసంధానం ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కోస్గి: ప్రభుత్వ పాఠశాలలలోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. సర్జఖాన్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలలో సోమవారం రాత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హెచ్ఎం శంకర్ నాయక్, సర్పంచ్ హరీష్ గౌడ్, ఎంపీపీ మధుకర్ రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వీరారెడ్డి పాల్గొన్నారు.

ఆటో బోల్తా

ధన్వాడ: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం సాయంత్రం ఆటో బోల్తా పడింది. కొల్లంపల్లి గ్రామం నుంచి ధన్వాడకు వస్తున్న ప్యాసింజర్ ఆటో బంక్ సమీపంలోకి రాగానే అదుపుతప్పిందని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. కాగా డ్రైవర్‌కు చిన్నపాటి గాయాలు కాగా ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు.

టిప్పర్లు పట్టుకొని వదిలేసిన అధికారులు

ధన్వాడ: అనుమతి లేకుండా ఎర్రమట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ అధికారులు పట్టుకొని వదిలేసిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ధన్వాడ సమీపంలోని ఓ పొలంలో నుంచి జేసీబీ పెట్టి మట్టి తరలిస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందని అధికారులు తెలిపారు. పంటభూమి చదును చేసే నేపథ్యంలో రైతు అయినందునా వదిలేశామని ఆర్ఐ మల్లేష్ వివరణ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట టౌన్ : వీవోఏల సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ, వీఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భీమేష్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రాం డిమాండ్ చేశారు. మార్చి 16, 17, 18 తేదీలలో నిర్వహించే టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. మహిళా సంఘాల సహాయకులుగా పనిచేస్తున్న వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు శంకర్, మొగులయ్య పాల్గొన్నారు.

పనులు వేగంగా పూర్తిచేయాలి

ఊట్కూరు: మనఊరు మనబడి పనులు వేగంగా పూర్తిచేయాలని ఎంపీడీఓ కాలప్ప అన్నారు. సోమ వారం మండలంలోని ఎడివెల్లి, చిన్నపొర్ల గ్రామ ల్లోని పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉగాదినాటికి పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేయడానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఉపాధి పనులను పరిశీలించారు. ఏపీఓ ఎల్లయ్య, ఈసీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పాదయాత్ర

కోస్గి: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రకు మద్దతుగా మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర జోరుగా కొనసాగుతోంది. నాలుగోరోజు సోమవారం మున్సిపల్ పరిధిలోని మాసాయపల్లితోపాటు కడంపల్లి గ్రామంలో పాదయాత్ర కొనసాగింది. మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కోస్గి: ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే అర్హత పరీక్షకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని సంపల్లి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులకు ఈ పుస్తకాలను అందజేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. నాయకులు నర్సిములు, వెంకటేష్ పాల్గొన్నారు.



వానరాలతో వేగేదెట్లా?



మాగనూర్‌లో సంచరిస్తున్న వానరాలు

- స్థానికులను గాయపరుస్తున్న వైనం
- పంటలను నాశనం చేస్తున్నాయని వాపోతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

మాగనూర్: మండల కేంద్రంలో కోతుల బెడద అధికమైంది. ఇళ్ల పైకప్పులు, చెట్లు, పంటపొలాలు, ప్రహరీలపై రాత్రి, పగలు తేడా లేకుండా సంచరిస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. మరోవైపు గ్రామంలోని హోటళ్లు, కిరాణా దుకాణాలలో చొరబడి ఆగమాగం చేస్తున్నాయి. కొన్ని సందర్భాలలో మహిళలు, చిన్న పిల్లలపైనా దాడులకు పాల్ప డి గాయపరుస్తున్నాయి. దీంతో కోతి పేరు చెబితేనే గ్రామంలోని ప్రజలు హడలెత్తిపోతున్నారు. ముఖ్యంగా ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు.

పంటలు నాశనం

గ్రామ సమీపంలో సాగు చేసిన పంటలను కోతులు నాశనం చేస్తున్నాయి. పత్తి కాయలు, వేరుశనగ కాయలను పూర్తిగా తినేస్తున్నాయి. ఇతర పంటలను ధ్వంసం చేస్తున్నాయి. కోతుల బాధ తాళలేక కొందరు రైతులు కూరగాయల సాగు మానేశామని చెబుతున్నారు. గతంలో ఇతర జంతువుల నుంచి రక్షించుకొనేందుకు కాపలా ఉండే వాళ్లమని, కోతులను నియంత్రించలేక పోతున్నామని చెబుతున్నారు. అంతేకాకుండా హరితహారంలో భాగంగా నాటిన మొక్కలనూ నాశనం చేస్తున్నాయని అంటున్నారు.

ఇళ్లు, దుకాణాలపై దాడులు

అదేవిధంగా పట్టణంలోని ఇళ్లు, దుకాణాలపై కోతులు దాడులు చేస్తున్నాయి. దుకాణాలలో ఉండే తినుబండారాలను పట్టుకెళ్తున్నాయి. చిన్నపిల్లల చేతుల్లో ఆహార పదార్థాలు కనిపిస్తే చాలు దాడులకు తెగబడుతున్నాయి. దీంతో ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా వాటి నుంచి సమస్యలు రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వాటిని అడవులకు తరలించాలని అంటున్నారు.

దాడులు చేస్తున్నాయి



కోతులు నిత్యం ఇళ్ల చూట్టూ తిరుగుతూ లోపలికి వచ్చి తినే వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి. అడ్డుకుంటే వెంటబడి మరీ గాయపరుస్తున్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలి.

– సుమన్, మాగనూర్

సమస్య పరిష్కరిస్తాం..

మాగనూర్ మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువగా ఉన్న మాట వాస్తవమే. ప్రజల ఫిర్యాదుమేరకు గతంలోనే ఎంపీడీఓకు లిఖిత పూర్వకంగా తెలియజేశాం. సంబంధిత అధికారులతో మాట్లాడి కోతులను అడవులకు తరలిస్తాం.

– రాజు, సర్పంచ్, మాగనూర్

మహిళలు అద్భుతాలు చేయగలరు



సన్మానం పొందిన మహిళలతో హెచ్ఎం, తదితరులు

కోస్గి: అభివృద్ధి కోసం కాలంతో పోటీపడుతున్న నేటి సమాజంలో ఆడపిల్లలు, మహిళలు ప్రోత్సహిస్తే అద్భుతాలు చేయగలరని బోగారం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం నేపథ్యంలో పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సన్మానం చేశారు. సర్పంచ్ వెంకటమ్మతోపాటు మహిళా ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘విద్యార్థులను ఆదుకోవడమే లక్ష్యం’



మక్తల్‌లో విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: నియోజకవర్గంలోని పేద విద్యార్థులను ఆదుకోవడమే తమ లక్ష్యమని వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశామన్నారు. ఇంకా అవసరం ఉన్న వారు 8367266777 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం వరలక్ష్మి, దత్తురావు, ఉపాధ్యాయులు అబ్దుల్, బాల్‌రాజ్, ఖయ్యూం, కమల, ఉషారాణి, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

చిన్నపొర్లలో..

ఊట్కూరు: చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో సోమవారం వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జగన్నాథరావు, ఉపాధ్యాయులు భాస్కర్, నర్సింహా పాల్గొన్నారు.

రంగుల కేళీ.. హోలీ



క్రికెటర్ అవతారంలో కాముడు



పేటలో హోలీ సంబరాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

నారాయణపేట టౌన్ : పట్టణంలోని శ్రీసాయి హైస్కూల్‌లో హోలీ పండుగ సందర్భంగా నర్సరీ, ఎల్‌కెజీ, యుకేజీ విద్యార్థులతో సంబరాలు నిర్వహించారు. కరస్పాండెంట్ సాయిలీల, ఉపాధ్యాయులు బాలప్ప, నర్సింహా తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని సింగార్‌బేస్ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో సోమవారం హోలీ నిర్వహించారు. హోలీ శాంతియుత వాతావరణంలో అత్యంత వైభవంగా నిర్వహించుకోవాలని వీహెచ్‌పీ అధ్యక్షుడు బి.నర్సిములు, గౌరవాధ్యక్షుడు క్యాతన్ రఘునాథ్ ఒక ప్రకటనలో అన్నారు. జిల్లా కేంద్రంలో సాయివిజయ్ కాలనీలో కొలువైన షిర్డి సాయి హనుమాన్ మందిరంలో మంగళవారం ప్రత్యేకపూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

నారాయణపేట రూరల్ : పట్టణ శివారులోని బీవండీ కాలనీ యువత ఏటా భిన్నంగా కాముడి బొమ్మను తయారు చేసి దహనం చేస్తున్నారు. 2020లో నోట్ల రద్దు నేపథ్యంలో మెడలో నోట్లు వేసుకున్న బొమ్మ, 21 కొవిడ్ విధ్వంసం గుర్తు చేసే విధంగా మాస్క్ ధరించి బొమ్మ తయారు చేశారు. ఇక గత ఏడాది కూరగాయల రేట్లు పెరగడంతో నిరసనగా, కూరగాయలు వేసుకున్న బొమ్మ తయారు చేశారు. ఈ ఏడాది క్రికెటర్ రూపంలో కాముడిని తయారు చేసి దహనం చేశారు.

ధన్వాడ: మండలంలోని అన్ని గ్రామాలలో హోలీ సందర్భంగా ప్రజలు సంబరాలు జరుపుకొంటున్నారు. కాముడు బొమ్మను సోమవారం రాత్రి మండల కేంద్రంలోని మారుతీనగర్‌లో దహనం చేశారు.

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో హోలీలీని పురస్కరించుకొని కాముడి దహనం చేశారు. కాముడి బొమ్మను పట్టణంలో ఊరేగించారు. వివిధ ఆలయాలు, యువజన సంఘాల సభ్యులు రాత్రి 11.30 తరువాత కామదహనం చేశారు.



జిల్లా కేంద్రంలో..

జాతర కమిటీ ఎన్నిక

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో సోమవారం నూతన అంబేద్కర్ జాతర కమిటీని ఎన్నుకున్నారు. జిల్లాలోని అన్ని మండల, పట్టణ దళిత, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మహేష్, ఉపాధ్యక్షులుగా తహేర్‌ఖాన్, చిన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా కాశీనాథ్, సహాయ కార్యదర్శిగా హన్మంతు, రవి, ఫయాజ్, చిన్ని కృష్ణ, కోశాధికారిగా చంటి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వడ్డెప్ప, కోఆర్డినేటర్‌గా మాధవ్ తదితరులు ఎన్నికయ్యారు. వచ్చే నెలలో అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించే వేడుకలకు తరలిరావాలని కోరారు.

‘ఉపాధ్యాయులకు అండగా కాంగ్రెస్ ’

నారాయణపేట టౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి ఉపాధ్యాయులకు కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మొదటి నుంచి ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉందన్నారు. హర్షవర్ధన్‌రెడ్డికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. టీపీసీసీ సభ్యులు వార్ల విజయ్‌కుమార్, జడ్పీ కో–ఆప్షన్ మాజీ సభ్యులు ఎండీ గౌస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుధాకర్, మాజీ ఎంపీపీ సదాశివారెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

ధన్వాడ: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మైనార్టీ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి బ్యాంకు అధికారులు, ఎంపీడీఓ సద్గుణ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిధిలోని మైనార్టీ కార్పొరేషన్ నుంచి 2022–23 సంవత్సరానికి చెందిన ఆర్థిక పరమైన సహాయం నిమిత్తం 150 మంది దరఖాస్తులు చేసుకోగా 90 మంది హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. ఎంపీఓ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్ : రుణాలు తీసుకున్న లబ్ధిదారులు బ్యాంకులకు సకాలంలో డబ్బు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సునీత అన్నారు. సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో మైనారిటీ కార్పొరేషన్ 2022–23 ఆర్థిక సంవత్సర పథకంలో భాగంగా ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, కెనరా బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 535 మంది దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూకు 321 మంది హాజరయ్యారు. ఆయా బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రచారం

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమని జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కొత్తపల్లి, మక్తల్ మండలాల్లో పాఠశాలల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లక్ష్మారెడ్డి, జనార్దన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కోస్గి: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పని చేసే ఉపాధ్యాయ సంఘానికి పట్టం కట్టాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గుండుమాల్ జెడ్పీహెచ్ఎస్, మోడల్ స్కూల్, బోగారం, కొమ్మూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో

మక్తల్: ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహులు అన్నారు. సోమవారం మక్తల్ పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్ : కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు పోతామని తపస్ జిల్లా అధ్యక్షులు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం నారాయణపేట, మక్తల్ పట్టణంలో ప్రచారం నిర్వహించారు. నర్సింహా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై శిక్షణ

నారాయణపేట రూరల్ : జిల్లాలోని అన్ని పీఎస్‌లలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి సోమవారం ట్రాఫిక్ నిబంధనలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ట్రాఫిక్ వర్టికల్ ఇన్‌చార్జ్ సురేష్‌గౌడ్ అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్‌బెల్టులు ధరించడంపై చైతన్యం తీసుకుని రావాలన్నారు. తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు.

ఉపాధ్యాయుల తీరుపై విమర్శలు

నారాయణపేట రూరల్ : మండలంలోని కొల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అయితే సగానికిపైగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించలేదు. చిన్నారులంతా ప్రత్యేక వేశాధారణలో సిద్ధమై రాగా వారికి గైడ్ చేయడానికి పూర్తిస్థాయిలో టీచర్లు లేక ఇబ్బందులు పడ్డారు. దీనిపై కార్యక్రమానికి వచ్చిన పేరెంట్స్ ఉపాధ్యాయుల తీరుపై విమర్శలు చేశారు. సీఆర్పీకి సైతం సమాచారం ఇవ్వలేదంటే తూతూ మంత్రంగా పూర్తి చేశారని అర్థమవుతుందన్నారు. దీనిపై హెచ్ఎంతో పాటు టీచర్లు ఇష్టారీతిగా నోరు పారేసుకోవడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది.

ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలంటూ దీక్ష



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కృష్ణా: కురుమ కులస్తులకు రాజ్యాంగ బద్ధంగా ఉన్న ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని కోరుతూ సోమవారం ఒక్కరోజు నిరాహార దీక్షను చేపట్టారు. సంఘం రాష్ట్ర నాయకుడు దేవరి మల్లప్ప ఎస్సీ సర్టిఫికెట్ ఇచ్చేవరకు పోరాడుతామని అన్నారు.అనంతరం తహసీల్దార్ వైపి రమేష్‌కు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదిక రూపంలో పంపిస్తామని తహసీల్దార్ వారికి సూచించారు.

వంటచెరుకు తరలిస్తే చర్యలు



పట్టుబడిన ట్రాక్టర్

మాగనూర్: మండలంలోని హిందూపూర్ రోడ్డు నుంచి మాగనూర్ వైపు వంట చెరుకుతో వెళ్తున్న ఒక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా ఎలాంటి అటవీ సంబంధ అనుమతి పత్రాలు లేకపోవడంతో ఫారెస్ట్ సెక్షన్ అధికారి నీలేష్‌కు సమాచారం అందించి అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు నిత్యం చెట్లను నరికి వంట చెరుకు కోసం తరలిస్తున్నారని అట్టువంటి వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే కృష్ణ మండల హిందూపూర్ గ్రామానికి చెందిన షబ్బీర్ అనే వ్యక్తి వారి సొంత పొలంలోని వంట చెరుకును తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌లో ఉంచి యజమానిపై కేసునమోదు చేశామని తెలిపారు.అక్రమంగా వంట చెరుకు తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జూనియర్ కళాశాల ఏర్పాటుపై వినతి



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మరికల్: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని యువక మండలి ఆధ్వర్యంలో నాయకులు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దేవసేనకు సోమవారం వినతిపత్రాన్నిచ్చారు. మరికల్ కాకుండా కొత్తగా ఏర్పడిన అన్ని మండలాలలో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశారని ఆమె దృష్టికి తీసుకెళ్లామన్నారు. విషయాన్ని ఇంటర్మీడియట్ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా ధన్వాడ కేజీబీవీ సమస్యలపై ప్రశ్నించినందుకు జీసీడీఓ పద్మనళిని పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయించాలని బీఎస్పీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్నిచ్చారు. యువక మండలి అధ్యక్షులు రవికిరణ్, రవి, శేఖర్, నరేష్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

పంట దగ్ధం

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామానికి చెందిన రైతు మల్‌రెడ్డికి చెందిన ఆయిల్ పాం పంట ప్రమాదవశాత్తు దగ్ధం అయ్యింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తనకు సంబంధించిన 12 ఎకరాల పొలంలో ఆయిల్ పాం పంట సాగు చేసి అంతర్ పంటగా పత్తిని సాగు చేసినట్లు పేర్కొన్నారు. అయితే తన పొలం పక్కన వారు ఒడ్డుకు నిప్పు పెట్టగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయన్నారు. పత్తితో పాటు డ్రిప్ పైపులు 6 ఎకరాల వరకు కాలిపోయాయని దాదాపు రూ. 8 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతు కోరారు.

నియామకం

కోస్గి: బీజేపీ సోషల్ మీడియా పాలమూర్ పార్లమెంట్ కో కన్వీనర్‌గా కోస్గి మండలానికి చెందిన ఎర్ర మల్లేష్‌ను నియమించారు. ఈ మేరకు కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి సోమవారం ప్రకటించారు. మల్లేష్ ఎంపిక పట్ల పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ కోటకొండ రాము, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మద్దూరు: మండలంలోని వీరారం చెందిన చెందిన అంజయ్యగౌడ్(59) 2వ తేదీన మూత్ర విసర్జనకు వెళ్లి కింద పడిపోవడంతో మహబూబ్‌నగర్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని కుమారుడు రుక్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ సోమవారం తెలిపారు.

బలవంతంగా రంగులు వేయొద్దు

నారాయణపేట రూరల్ : హోలీ పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోవాలని బలవంతంగా ఎవరిపైనా రంగులు చల్లరాదని సీఐ రవిబాబు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఇతరులకు ఇబ్బందులు కల్గించే విధంగా, మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని గ్రామాలు, పట్టణాల్లో పోలీస్ పెట్రోలింగ్ కొనసాగుతుందని, సీసీల్లో నమోదు జరుగుతుందని జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. చెరువుల దగ్గర నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని తనిఖీలు కొనసాగుతాయన్నారు.

చెక్కు అందజేత

నర్వ: బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి సోమవారం నర్వకు చెందిన బాధితుడు గ్వాలి వెంకటన్నకు రూ. 42 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. నాయకులు దండు అయ్యప్ప, నర్వ గ్రామ అధ్యక్షులు గడ్డం నర్సిములు తదితరులున్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



పేట శిశుమందిర్‌లో ఉపాధ్యాయులైన విద్యార్థులు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ రామాలయం ప్రాథమిక పాఠశాల లో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన చార్యులు గజ్జల శ్రీనివాస్, ఆచార్యులు కవిత, గోపాల్, బబిత, కవిత, సోని, పోషకులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం విద్యార్థులు ఘనంగా స్వపరి పాలన దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. చక్కగా బోధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మక్తల్: మున్సిపాలిటీ పరిధిలోని దయానంద్ విద్యా మందిర్‌లో వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం కర్ని స్వామి, కౌన్సిలర్ లక్ష్మి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, నర్సింహరెడ్డి పాల్గొన్నారు. నర్సిరెడ్డి పల్లిలో జరిగిన వేడుకల్లో కలెక్టర్‌గా రోహిత్‌కుమార్, డీఈఓ నవగీతిక, హెచ్ఎంగా మమత బాధ్యతలు చేపట్టారు.

కృష్ణా: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతో పాటు గుడెబల్లూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ఉపాధ్యాయులు, పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోస్గి: మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన వేడుకల్లో హెచ్ఎం పవన్ కుమార్ పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని అమ్మపల్లిలో జరిగిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయులు ప్రగతి, విద్యాకమిటీ చైర్మన్ బాలప్ప, అటెండర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని పెదిరిపాడ్‌లో జరిగిన వేడుకల్లో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సూర్య, ఉపాధ్యాయులు మల్లికార్జున్, వెంకట్‌రాములు, హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

నర్వ: మండలంలోని ఉందేకోడ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో హెచ్ఎం కోట్ల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ధన్వాడ: హన్మన్‌పల్లిలో సోమవారం ఉదయం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసు కను తరలిస్తున్న ట్రాక్టర్‌నుపోలీసులు పట్టుకున్నారు. ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చే శామని ఎస్ఐ రమేష్ తెలిపారు. కేసు న మో దు చేసి తహసీల్దార్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు.